
బుధవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 37.0°C | కనిష్ఠం : 23.0°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా : 6.34 గం..
సహర్ : శుక్రవారం ఉ : 4.51 గం..



- ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం
- మా ఫోన్‌లు కూడా ట్యాపింగ్ అయ్యాయన్న మంత్రి కొండా సురేఖ
- ఎన్నికల సమయంలో కొండా మురళి ఫోన్ ట్యాప్ అయిందని వ్యాఖ్య
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతిపక్ష నేతల ఫోన్‌లు కూడా ట్యాపింగ్
- వ్యాపారులు, మీడియా ప్రతినిధుల ఫోన్లు సైతం..
- పర్వతగిరి వార్‌రూమ్ నుంచే చేసినట్లుగా అనుమానాలు
- ట్యాపింగ్ పోలీసులకు పోస్టింగులపై దర్యాప్తు బృందం ఆరా

ట్యాపింగ్ టెన్షన్!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. ఇప్పటివరకు వ్యాపారుల ఫోన్‌లే ట్యాపింగ్ చేశారని భావిస్తున్న తరుణంలో.. తమ ఫోన్‌లు కూడా ట్యాపింగ్ చేశారని మంత్రి కొండా సురేఖ చెప్పటం ఓరుగల్లు రాజకీయాల్లో హాట్‌టాపిక్ అయింది. ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన మరికొంత మంది నేతల ఫోన్‌లతో పాటు కొంతమంది మీడియా ప్రతినిధులు ఫోన్‌లు కూడా ట్యాపింగ్ చేసి ఉంటారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే నేతల ఫోన్‌ట్యాపింగ్ జరిగినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఫోన్‌ట్యాపింగ్‌లో కీలక నిందితులుగా ఉన్న పోలీసు అధికారులు ఉమ్మడి వరంగల్‌కు చెందిన వారే కావటంతో, వారి సిఫార్సుల మేరకు వివిధ ప్రాంతాల్లో పోస్టింగులు పొందిన పోలీసులపై దర్యాప్తు బృందం ఆరా తీస్తుండటం ఖాకీల్లో గుబులు రేపుతోంది. పర్వతగిరి వార్‌రూమ్‌లో వీరి సహకారం ఏమిటనే కోణంలో దర్యాప్తు బృందం వివరాలు సేకరిస్తున్నట్లుగా సమాచారం.

ట్యాపింగ్ ప్రకంపనలు

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం వరంగల్ ఖాకీలను ఆందోళనకు గురిచేస్తోంది. ట్యాపింగ్‌లో ఏ-1, ఏ-2 నిందితులుగా ఉన్న ఎస్‌ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుతో పాటు మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావులిద్దరు కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులే కావటం, వీరికి ఎవరెవరితో సంబధాలు ఉన్నాయో అనే చర్చ నడుస్తోంది. కీలక నిందితుడుగా ఉన్న ప్రణీత్‌రావును అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులకు రాష్ట్రవ్యాప్తంగా పలువురు వ్యాపారుల ఫోన్‌లు కూడా ట్యాపింగ్ చేసినట్లుగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో వరంగల్‌కు చెందిన బంగారం, హవాలా వ్యాపారితో పాటు బట్టలు, చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్‌లో కీలకంగా ఉన్న పలువురు వరంగల్ వ్యాపారుల ఫోన్ ట్యాప్ చేసి భారీగా రాబట్టుకున్నట్లుగా ప్రత్యేక దర్యాప్తు బృందం పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బాధితులను పిలిచి మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలోనే వ్యాపారులే కాదు.. రాజకీయ నేతల ఫోన్‌లు కూడా ట్యాప్ అయినట్లుగా బయటకు వస్తుండటంతో ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యన్నం శ్రీనివాస్‌రెడ్డి.. తన ఫోన్ ట్యాప్ చేశారని డీజీపీకి ఫిర్యాదు చేయగా, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు కూడా తన ఫోన్ కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. ఈ క్రమంలో తాజాగా వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ.. తన భర్త కొండా మురళీ ఫోన్‌ను ఎన్నికల సమయంలో ట్యాప్ చేశారని చెప్పటంతో ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కాయి. ఇంకెవరెవరి ఫోన్‌లు ట్యాప్ అయ్యే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

లీడర్ల ఫోన్‌లు ట్యాపింగ్

ఫోన్‌ట్యాపింగ్ కేసు హైదరాబాద్‌లో విచారణ జరుగుతున్నప్పటికీ వరంగల్‌ను కుదిపేస్తోంది. రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఫోన్ ట్యాపింగ్ చేసిన వాఖ్యలు హట్‌టాపిక్‌గా మారాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన భర్త కొండామురళీ ఫోన్ ట్యాప్ చేశారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు తమకు అప్పుడే అర్థమయిందన్నారు. అయితే ఈ స్థాయిలో ట్యాపింగ్ ఉంటదనుకోలేదని, ఈ ట్యాపింగ్‌లో ఎవరున్నా వదిలేది లేదని, చట్ట ప్రకారం శిక్ష తప్పదని మంత్రి పేర్కొన్నారు. అయితే ఫోన్‌ట్యాపింగ్‌పై సురేఖ చేసిన వాఖ్యలు వరంగల్ రాజకీయాల్లో చర్చనీ యాంశంగా మారింది. కేవలం కొండా దంప తుల ఫోన్లు మాత్రమే ట్యాపింగ్ అయ్యా యా..? లేక అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న రేవంత్‌రెడ్డితో పాటు ఆయనకు సన్నిహితంగా ఉండే ఇతర నేతల ఫోన్‌లు కూడా ట్యాప్ అయ్యాయా..? అనే చర్చ జరుగుతోంది. రేవంత్‌రెడ్డి బృందంలో ఉన్న నేతల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లుగా ప్రణీత్‌రావు పోలీసుల విచారణలో వెల్లడించినట్లుగా ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీతో పాటు పాలకుర్తికి చెందిన ఓ మహిళ నాయకురాలి ఫోన్ కూడా ట్యాపింగ్ అయినట్లుగా ప్రచారం జరుగుతోంది. అలాగే ఓ మంత్రితో పాటు గ్రేటర్ వరంగల్ పరిధిలోని మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే ఫోన్‌లు కూడా ట్యాప్ చేసి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల వ్యూహాలను తెలుసుకోవటం కోసం ఎప్పటికప్పుడు ఫోన్‌లు ట్యాపింగ్ చేసి ఉంటారనే చర్చ జరు గుతోం ది. పనిలో పనిగా కీలకంగా వ్యవహరిస్తున్న కొంతమంది మీడియా ప్రతినిధులు ఫోన్‌లు కూడా ట్యాపింగ్‌కు గురైనట్లుగా ప్రచారం జరుగుతోంది. వివిధ పార్టీల నేతలతో ఏ విషయాలు చర్చించుకుంటున్నారనే విషయంపై ట్యాప్ చేసి, పైఅధికారులకు చేరవేసినట్లుగా సమాచారం. దీంతో వ్యాపారులు, మీడియా, రాజకీయ నేతలు ఫోన్‌లు ట్యాపింగ్ అయి నట్లుగా జరుగుతున్న ప్రచారం వరంగల్‌లో చర్చనీయాంశంగా మారింది.

పైరవీ పోలీస్ పోస్టింగులపై ఆరా..

వరంగల్ జిల్లా పర్వతగిరిలో వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లుగా గుర్తించిన దర్యాప్తు బృందం.. ఈ వార్‌రూమ్‌కు సహకరించిన పోలీసులు ఎవరనే కోణంలో విచారణ చేపట్టినట్లుగా సమాచారం. ట్యాపింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికా రులు.. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పైరవీలు చేసి తమకు అనుకూలంగా ఉండే పోలీసులకు పోస్టింగ్‌లు ఇప్పించా రు. వరంగల్‌వాసులే కావటంతో ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావులు పలువురు డీఎస్పీలు, ఏఎస్పీలు, సీఐ, ఎస్ఐ పోస్టులను భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్‌తోపాటు వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోస్టింగులు ఇప్పించినట్లుగా సమాచారం. అప్పటి ఎమ్మెల్యేలు అభ్యంతరం చెప్పినప్పటికీ పైస్థాయి నుంచి ఫోన్‌లు చేయించి ట్యాపింగ్ బ్యాచ్ పోస్టింగులు ఇప్పించినట్లుగా దర్యాప్తు బృందం దృష్టికి వచ్చింది. దీంతో మూడేళ్లగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన పోలీసు బదిలీలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తున్నట్లుగా సమాచారం. పర్వతగిరి వార్‌రూమ్‌కు ఈ పైరవీల అధికారులు ఏమైనా సహకరించారా..? వ్యాపారుల బ్లాక్ మెయిలింగ్‌లో వీరి పాత్ర ఏమైనా ఉందా..? అనే కోణంలో ఆరా తీస్తున్నట్లుగా సమాచారం. దీంతో పోలీసుశాఖలో ట్యాపింగ్ వ్యవహారం కలవర పెడుతోంది. ఇన్ని కోణాల్లో విచారణ జరుగుతుడటంతో తమకు ఎక్కడైనా సంబంధం ఉందా..? అనే టెన్షన్‌లో కొంతమంది పోలీసులు ఉన్నారు. మొత్తానికి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం వరంగల్‌ను కుదిపేస్తోంది.

బీఆర్ఎస్ పతనం ప్రారంభమైంది

- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఓసిటీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం



క్యాంపు కార్యాలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు

వరంగల్ సిటీ, మార్చి 27: భారత రాష్ట్ర సమితి పతనం ప్రారంభమైందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నగరంలోని ఓసిటీలో బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన క్యాంపు కార్యాలయంలో మంత్రి సురేఖ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎంగా ఉండగా కవిత అక్రమ వ్యాపారాలకు తెర లేపిందన్నారు. కేసీఆర్ కుటుంబం మొత్తం అక్రమాలకు కేరాఫ్‌గా మారిపోయిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వారి బాగోతాలు ఒక్కొక్కటి బయట పడుతున్నాయన్నారు. ప్రభుత్వం వచ్చి వంద రోజులే అయిందని, అయినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుండడంతో బీఆర్ఎస్ నాయకులు ఏదో విధంగా ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఆప్రయత్నాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానం కాంగ్రెస్ పార్టీదేనని మంత్రి కొండా సురేఖ అన్నారు. గత ఎన్నికల్లో తనకు వచ్చిన మెజారిటీ కన్నా మూడింతలు ఎక్కువగా ఇవ్వాలని కార్యకర్తలను కోరారు. కాగ్రెస్ పార్టీ రావడం వల్లే కరువు వచ్చిందని బీఆర్ఎస్ ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దోచుకున్నారని ఆరోపించారు. ఈ దుస్థితికి కేసీఆర్ అండ్ కోనే కారణమని తెలిపారు. రైతులు విపక్ష నాయకుల మాటలు నమ్మవద్దని.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. 2025లో కొండా మురళీధర్‌రావు ఎమ్మెల్సీగా రానున్నారని తెలిపారు. కొండా సుస్మితా పటేల్ కూడా నాయకురాలిగా ప్రజల మధ్యకు రానున్నదని చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రిగా గుళ్ల, గోపురాలు కట్టే వారికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అదేవిధంగా వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ... ఇక నుంచి క్యాంపు కార్యాలయంలో రోజు ఇద్దరు పీఏలు అందుబాటులో ఉంటారని చెప్పారు. అలాగే వారంలో ఐదు రోజులు మంత్రి సురేఖ లేదా తాను మధ్యాహ్నం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. కొత్త పాత నాయకుల మధ్య తారతమ్యం వద్దని, అందరం కలిసి ప్రజల కోసం పని చేద్దామని అన్నారు.



మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

రూ.1890 కోట్ల టర్నోవర్‌తో బ్యాంకు సేవలు

- కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీబీ
- నాలుగేళ్లలో రూ.810 కోట్ల కొత్త రుణాలు
- వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, మార్చి 27 : యేటా క్రమక్రమంగా ఆర్థిక వృద్ధి సాధిస్తూ రూ.1,890 కోట్ల టర్నోవర్‌తో వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలు విస్తృతమవుతున్నాయని బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు కార్యాలయంలో మహాజన సభ చైర్మన్ రవీందర్‌రావు అధ్యక్షతనజరిగింది. ఆధునీకంగా నిర్మితమైన కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకు సేవలు, ఆర్థికాభివృద్ధి, రుణాలు, రుణాల రికవరీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మల్టీ సర్వీసు సెంటర్ల నిర్వహణ తదితర అంశాలను రవీందర్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభకు వివరించారు. రూ.1890 కోట్ల టర్నోవర్‌తో బ్యాంకు కార్యకలాపాలు సాగడం ఆషామాషీ కాదన్నారు. రూ.860 కోట్ల నుంచి రూ.1890 కోట్లకు తీసుకురావడంలో పాలకవర్గ కమిటీతో పాటు బ్యాంకు సిబ్బంది, పీఏసీఎస్ చైర్మన్లు తదితరుల కృషి ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మరో పది కోట్ల టర్నోవర్ సాధించి మొత్తంగా నిర్దేశించుకున్న రూ.1900 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు.

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కమర్షియల్ బ్యాంకులకు దీటుగా కార్యనిర్వహణలో ఉందని రవీందర్‌రావు పేర్కొన్నారు. విస్తరిస్తున్న బ్యాంకు సేవలు, సాధిస్తున్న లక్ష్యాలు, రుణాల అందజేత వంటి అంశాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కేవలం అంకెల రూపంలో ఆర్థిక వృద్ధిని చూపడం లేదని, క్షేత్ర స్థాయిలోని ఫలితాలే బ్యాంకు పనితనానికి కొలమానంగా నిలుస్తున్నాయని చెప్పారు. డీసీసీ బ్యాంకు అంటే కేవలం రైతులు, వ్యవసాయ ఆధారిత ప్రత్యక్ష, పరోక్ష రంగాల రుణాల కల్పనకే పరిమితమై ఉండేదనే భావన ఉండేదని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఈ క్రమంలో బ్యాంకు సేవలను అన్ని వర్గాలకు చేరువ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించుకొని రైతులకే కాకుండా అన్నివర్గాల వారికి రుణాల కల్పన అందచేస్తున్నట్లు చెప్పారు. పంట రుణాలతో పాటు వ్యాపార, విద్య, స్వయం ఉపాధి రంగాలకు సైతం బ్యాంకు రుణాలను విస్తరించడంతో పాటు ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటుందన్నారు.

రుణాల మంజూరుని అన్ని వర్గాలకు విస్తరించడంతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ జీవితాల్లో ఆర్థికవృద్ధిని సాధిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.85 కోట్ల రుణాలను అందచేసినట్లు తెలిపారు. వ్యవసాయ ఆధారిత ప్రత్యక్ష, పరోక్ష రంగాలపై పట్టు ఉన్న యువతకు రుణాల అందచేత ద్వారా చేయూత ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఉపాధి కోసం నగరాల బాట పట్టకుండా యువత తమ గ్రామాల్లో ఉండి స్వయం ఉపాధిని పొందుతున్నట్లు చెప్పారు. పంట రుణాల కింద 8,578 మంది రైతులకు రూ.196 కోట్లు అందచేశామన్నారు. 22 మందికి జేఎల్‌జీ రుణాల ద్వారా రూ.7 కోట్లు అందచేసినట్లు తెలిపారు. పీఎంఈజీపీ ద్వారా 86 మందికి రూ.10 కోట్ల రుణాల కల్పన, నాలుగేళ్లలో 30,500 మందికి వివిధ రూపాల్లో మొత్తం రూ.810 కోట్ల మేరకు నూతన రుణాలు అందచేశామని మొత్తంగా రవీందర్‌రావు వివరించారు. హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు కార్యాలయం ఆధునిక హంగులతో నిర్మాణమవుతున్నట్లు రవీందర్‌రావు చెప్పారు.

ఈ మహాజన సభలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు రమేష్, రంజిత్, రమేష్, మురళి, నరసింహారావు, గోపాలరావు, ఉపేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, హరిప్రసాద్, శ్రీనివాస్, రవిరాజ్, జగన్మోహన్‌రావు, నరేందర్, ప్రదీప్‌చందర్‌తో పాటు డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్లు నాగేశ్వరరావు, వెంక టేశ్వర్లు, జీఎం శ్రీధర్, డీజీఎంలు రోహిణి, దమయంతి, కురువనాయక్, ఏజీఎం రాజశేఖర్, నవీన్, రాధిక, కళ్యాణి తదితర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- బీజేపీ, బీఆర్ఎస్ ఆరోపణలను తిప్పికొట్టాలి
- ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్

వరంగల్ సిటీ, మార్చి 27 : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ప్రజలు జేజేలు కొడుతున్నారని, రానున్న వరంగల్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ఏఐసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా అండ్ కమ్యూనికేషన్ కమిటీ ఇన్‌చార్జి సుజాత పాల్ అన్నారు. బుధవారం వరంగల్ డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సుజాత పాల్‌తో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి హాజరయ్యారు. ప్రజలకు చేరువైన కాంగ్రెస్ పార్టీపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేసే అసత్య ఆరోపణలను తిప్పి కొట్టేందుకు డీసీసీ అధికార ప్రతినిధులుగా ముగ్గురిని, అలాగే నియోజకవర్గాలకు అధికార ప్రతినిధుల పేర్లను ప్రకటించారు.

ఈ సందర్భంగా సుజాత పాల్ మాట్లాడుతూ.. దేశంలో మోదీ పాలన, రాష్ట్రంలో గత కేసీఆర్ పాలన ఒకటేనన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి మోదీపై పోరాటం చేస్తున్నారని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, అలాగే మణిపూర్ నుంచి ముంబయి వరకు 10 వేల కిలోమీటర్ల వరకు నడుచుకుంటూ జోడో యాత్ర నిర్వహించారంటే ఆయన పోరాట పటిమను అర్థం చేసుకోవాలన్నారు. జోడో యాత్రకు ప్రజల స్పందనను చూసి కేంద్ర ప్రభుత్వం భయాందోళనకు గురైందన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకిచెందిన 11 బ్యాంకు ఖాతాలను సీజ్ చేసిందన్నారు. ఇందుకోసం తాము న్యాయపరంగా పోరాడుతున్నామని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్స్ రూపేణా రూ.4వేల కోట్లు బీజేపీకి ఎవరు ఇచ్చారో తెలియదని చెబుతున్నారని సుజాత పాల్ ఎద్దేవా చేశారు. మెగా కంపెనీ బీజేపీకి, బీఆర్ఎస్‌కు కోట్లాది రూపాయలను ఎక్టోరల్ బాండ్స్ రూపంలో అందించిందన్నారు. బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ పార్టీ.. అన్నారు.

వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నందున తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని విభాగాలు ఎన్నికల్లో అధిక మెజారిటీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికలు దేశం స్థితిగతులను మార్చే ఎన్నికలన్నారు. 12వేల లక్షల కోట్ల మొండి బకాయిలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. అదే ఇక్కడ రైతులు రూ.50వేలు, రూ.30వేలు బ్యాంకు రుణం ఉంటే నోటీసులు ఇచ్చి ఆత్మహత్యలు చేసుకునే విధంగా చేశారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత పాల్

మోదీ చెప్పినట్లు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అంటే 20 కోట్ల ఉద్యోగాలు రావాలని, కానీ 20వేల ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఎట్ల ప్రజలను మభ్యపెట్టారో అదేవిధంగా దేశంలో నరేంద్రమోదీ కూడా ప్రజలను మభ్యపెట్టడంలో దిట్టన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

డీసీసీ అధికార ప్రతినిధుల నియామకం

డీసీసీ అధికార ప్రతినిధులుగా రావుల శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మాని శేఖర్‌రావు, తక్కళ్లపల్లి రవిందర్‌రావుతో పాటు పరకాల నియోజకవర్గానికి చాడ కొమురారెడ్డి, జంగం రమేష్, నర్సంపేట నియోజకవర్గానికి సౌంటి రంజిత్‌రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గానికి బర్లసహదేవ్‌ను అధికార ప్రతినిధులుగా ప్రకటించారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- జిల్లా వ్యాప్తంగా 208 కేంద్రాల ఏర్పాటు
- 1.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం



వరంగల్ కలెక్టరేట్, మార్చి 27: వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 208 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఈ సీజన్‌లో మొత్తం 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించే లక్ష్యానికి ప్రణాళికలు రూపొందించారు. పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయ శాఖ, రైస్ మిల్లర్స్ మార్కెటింగ్ శాఖ, డీఆర్‌డీఏ, సహకార శాఖల సమన్వయంతో నిర్ధేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించారు.

208 కేంద్రాల ఏర్పాటు

వరంగల్ జిల్లా పరిధిలోని 13 మండలాల్లో మొత్తం 208 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచడంతోపాటు ఇతర మౌలిక వసతులను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మండల స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌లు, మెప్మా, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు.

1.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 208 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 1.50లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయా లని జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని నిర్ధేశించుకుంది. ఏప్రిల్ మొదటి లేదా రెండవ వారంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏ గ్రేడు రకానికి రూ.2,060

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం చేసిన ప్రభుత్వ యంత్రాంగం రైతుల వద్ద నుంచి ఏ గ్రేడు ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.2,060 నిర్ధయించగా, సాధారణ రకానికి రూ.2,040గా నిర్ణయించారు. ఇక గత సీజన్‌లో ప్రభుత్వం చెల్లించే ధర కంటే ప్రైవేటు వ్యక్తులు చెల్లించే ధర అధికంగా ఉండటంతో వానాకాలం ధాన్యాన్ని ఎక్కువగా వారికే రైతులు విక్రయించారు. యాసంగిలో సైతం ధర ఎక్కువగా చెల్లించే వారికే రైతులు వరి ధాన్యాన్ని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

వాతావరణ మార్పులకు అనుగుణంగా ఏర్పాట్లు

అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిచి మద్దతు ధర పలకదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లో అదనంగా టార్పాలిన్లు నిలువ చేస్తున్నారు. కేంద్రాల్లో ఎక్కువగా ధాన్యం నిలువలు ఉండకుండా ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు వీలుగా సరిపడా వాహనాలను ఏర్పాటు చేశారు. రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే మొదలు పెట్టారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి
సంధ్యారాణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 208 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించడం జరిగింది. ఏప్రిల్ నెల మొదటి లేదా రెండవ వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తాం. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకం

- వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో బుధవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణిలతో కలిసి వివిధ విభాగాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సిబ్బందికి శిక్షణ, మెటీరియల్, రవాణా, స్వీప్, శాంతిభద్రతలు, ఈవీఎంలు, ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వివరించారు. అలాగే బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, ఎంసీఎంసీ, సోషల్ మీడియా, కంప్లెయింట్, మానిటరింగ్ సెల్, 1950 కాల్ నంబర్ల నిర్వహణపై నోడల్ అధికారులకు కూలంకషంగా వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వహించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర నివేదికలను నిర్ధేశిత కాలంలో తప్పనిసరిగా అందజేయాలని తెలిపారు.

ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతీ ఉద్యోగి కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం-12 సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. పోలింగ్ బూత్‌ల వద్ద మౌలిక వసతులు, అవసరమైన ర్యాంపులు, వేసవి కాలం దృష్ట్యా తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల సామగ్రికి సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారులతో సంప్రదింపులు చేస్తూ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సి-విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులకు సైతం తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాలన్నారు. జిల్లా నోడల్ అధికారులందరు వారికి కేటాయించిన ఎన్నికల విధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ రవీందర్, వరంగల్, హనుమకొండ డీఆర్‌వోలు శ్రీనివాస్, గణేష్, ఆర్డీవోలు దత్తు, కృష్ణవేణి, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

సోమన్న హుండీ ఆదాయం రూ. 19 లక్షలు

పాలకుర్తి, మార్చి 27 : పాలకుర్తి సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 19,25,293 లక్షలు సమకూరినట్లు ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆలయ కల్యాణ మండపంలో హుండీ ఆదాయాన్ని యాదాద్రి భువనగిరి ఇన్‌స్పెక్టర్ సుమతి పర్యవేక్షణలో లెక్కించారు. 11 గ్రాముల మిశ్రమ బంగారం, కేజీ 62 గ్రాముల మిశ్రమ వెండి, 15 అమెరికా కరెన్సీ నోట్లు , 66 డాలర్లు, 5 ఆస్ట్రేలియన్ డాలర్లు, 5 యూరోపియన్ పౌండ్లు హుండీలో లభ్యమైనట్లు ఆమె తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ అధికారులు వెంకటయ్య, శ్రీనివాస్, రాములు, పూజారులు డీవీఆర్ శర్మ, నాగరాజు, లక్ష్మన్న, రామన్న, అనిల్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన ట్రాఫిక్ హోంగార్డు

మట్టెవాడ, మార్చి 27: వరంగల్‌లో పెయింటర్‌గా పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్న ఉత్తరాఖండ్‌కు చెంది న హితోవా సోను ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడేందుకు యత్నిస్తున్న క్రమంలో వరంగల్ ట్రాఫిక్ హోంగార్డు వై.రవి కాపాడాడు. ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపిన ప్రకారం... బుధవారం సాయంత్రం వరంగల్ అండర్ బ్రిడ్జి(చిన్నబ్రిడ్జి) వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న వై.రవి రైలు పట్టాలపై ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడాన్ని గమనించాడు. ఆ వెంటనే రైల్వే ట్రాక్‌పైకి వెళ్లగా అదే పట్టాలపై రైలు వస్తుండటాన్ని గమనించి హోంగార్డు రవి హితోవా సోనును పక్కకు తీసుకొచ్చి ప్రాణాలను కాపాడాడు. హితోవా సోను వరంగల్‌లో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తి ప్రాణాలను కాపాడిన ట్రాఫిక్ హోంగార్డు రవిని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్‌లు శాలువాతో సత్కరించి అభినందించారు.



హితోవా సోనును కాపాడిన ట్రాఫిక్ హోంగార్డు రవి

పాఠశాలలకు కొత్త కమిటీలు

ఇక నుంచి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు..

విద్యాలయాల పర్యవేక్షణలో మహిళా సంఘాల సభ్యుల భాగస్వామ్యం

పాఠశాలల నిర్వహణల్లోనూ క్రియాశీలంగా మారనున్న ఏఏపీసీలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 27: ప్రభుత్వ స్థానిక సంస్థల యాజమాన్య పాఠశాలల్లో ఇక నుంచి స్థానిక మహిళాసంఘాల సభ్యులను భాగస్వామ్యం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాఠశాలల పర్యవేక్షణ, మౌలిక వసతుల కల్పన తదితర నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాల సభ్యులకు అప్పగించేందుకు విధి విధానాలు రూపొందించి స్థానిక జిల్లా విద్యాశాఖాధికారులకు పంపించింది. స్వయం సహాయక సంఘాల సభ్యులను కమిటీలుగా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులను ప్రభుత్వం జిల్లాల విద్యాశాఖాధికారులకు జారీచేసింది. ఇక నుంచి మహిళా సంఘాల సభ్యులు కమిటీలుగా ఏర్పడిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలే ప్రభుత్వ బడులు ఆలన పాలన చూడనున్నాయి. అయితే గతంలో పాఠశాల నిర్వహణ కమిటీలైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు మంగళం పాడేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్ఎంసీల స్థానాల్లోనే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే వరంగల్ జిల్లాలో ఇప్పుడిప్పుడే ఏఏపీసీలు ఏర్పాటు అవుతుంటే హనుమకొండ జిల్లాలో మాత్రం ఈ కమిటీలు పూర్తి స్థాయిలో ఏర్పాటు అయ్యాయి.

ప్రభుత్వ ఉద్దేశం ఇదే..

విద్యా, పాఠశాలల నిర్వహణలో, అభివృద్ధిలో మహిళా స్వయం సహాయక సంఘాలు భాగస్వామ్యంతో నాణ్యమైన ఫలితాలు వస్తాయని భావించిన ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు శ్రీకారం చుట్టింది. అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను అమలు చేయడం, పర్యవేక్షించడం, బలోపేతం చేయడం నిర్వహించడం తదితర ఈ కమిటీలు నిర్వహిస్తాయి. విద్యార్థులకు యూనిఫాంలు, మధ్యాహ్న భోజన కార్యక్రమ నిర్వహణతో పాటు పారిశుధ్య పనులను చేయించడంలో ఈ కమిటీలు కీలకంగా పనిచేస్తాయి. గ్రామాల్లో గ్రామ సంస్థలు, పట్టణ ప్రాంతాల్లో ప్రాంత స్థాయి సమాఖ్యల్లోని సభ్యులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలుగా ఏర్పడి సర్కారు బడుల నిర్వహణ బాధ్యతలను స్వీకరించనున్నారు.

పర్యవేక్షణ, నిర్వహణలో భాగస్వామ్యం

అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలు సర్కారు బడుల పర్యవేక్షణ, నిర్వహణలో ప్రత్యేకతను కనబరచనున్నారు. పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక వసతులను బలోపేతం చేయనున్నారు. బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, యూనిఫాంలు కుట్టించుట తదితర బాధ్యతలను ఈ కమిటీలు పర్యవేక్షిస్తాయి. పనుల కోసం ఉపాధి హామీ, ప్రత్యేకాభివృద్ధి నిధులతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలు ఇచ్చే నిధులను వీటికి వెచ్చిస్తూ పనులను పర్యవేక్షిస్తారు. నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించి ఆయా పనుల విలువలో 3 శాతం నిధులను సర్వీసు చార్జీల కమిటీలకు జిల్లా కలెక్టర్ చెల్లించనున్నారు. పాఠశాలల్లో అత్యవసరమైన పనులను ఈ కమిటీల ద్వారా వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విద్యాశాఖాధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు నిర్వహించే పనులను ఎంవోఎంబీ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల, సాంకేతిక సంస్థల ప్రతినిధులు పర్యవేక్షించనున్నారు. ప్రతీ విద్యాశాఖ కమిషనర్ సమీక్షించి ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నారు.



క్రియాశీలకంగా మారనున్న ఏఏపీసీలు

పాఠశాల నిర్వహణ, పర్యవేక్షణల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ)లు క్రియాశీలంగా మారనున్నాయి. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను సర్కారు బడుల నిర్వహణలో క్రియాశీలం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో సదుపాయాలు, మానవ వనరుల లభ్యతను సమీక్షించి పాఠశాల అవసరాలను తీర్చడానికి కమిటీ ప్రణాళిక రూపొందిస్తుంది. పాఠశాలలోని బోధన, ఇతర సిబ్బంది హాజరు, లభ్యతను సమీక్షించి పర్యవేక్షిస్తారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పర్యవేక్షించి క్రమబద్దీకరిస్తారు. పాఠశాల అభివృద్ధి కోసం విడుదలైన నిధుల సక్రమ వినియోగంపై పర్యవేక్షణ, సామాజిక తనిఖీలు నిర్వహించి పారదర్శకంగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటారు. పాఠశాల పునఃప్రారంభానికి ముందే స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలను సక్రమంగా, సకాలంలో కుటించే సంబంధిత పనులకు నిర్వహిస్తారు. పాఠశాలకు సంబంధించిన ప్రభుత్వం అప్పగించిన ఏదైనా పనిని నిర్వహిస్తారు. సోలార్ ప్యానెల్స్, వాటర్ ప్లాంట్లు తదితర సౌకర్యాల నిర్వహణతో సహా ప్రాథమిక మౌలిక సదుపాయాలు, పాఠశాల పారిశుధ్యం తదితర అంశాలతో కూడిన పాఠశాల మొత్తం నిర్వహణను బలోపేతం చేయడంలో ఈ కమిటీలు క్రియాశీలంగా పనిచేస్తాయి.

ఏఏపీసీ ఎంపిక ఇలా...

గ్రామాల్లో గ్రామ సమాఖ్యలు, పట్టణ ప్రాంతాల్లో ప్రాంత సమాఖ్య అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ కమిటీలకు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. గ్రామంలో, పట్టణంలో ఒకటి కంటే ఎక్కువగా విలేజ్ ఆర్గనైజేషన్లు, ఏరియా లెవల్ ఫెడరేషన్‌లు ఉంటే ఛైర్‌పర్సన్ పాత్రను ప్రతీ సంవత్సరం రొటేషన్ ప్రాతిపదికన అప్పగిస్తారు. సంబంధిత పాఠశాలలో 1 నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల తల్లులను ప్రతీ తరగతి నుంచి ముగ్గురిని కమిటీ ఛైర్ పర్సన్, మెంబర్ కన్వీనర్‌లచే సంయుక్తంగా నామినేట్ చేస్తారు. ముగ్గురు సభ్యుల్లో కనీసం ఒక్కరైనా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారై ఉండాలి. కమిటీ సభ్యుల పదవీ కాలం రెండేళ్లుగా ఉంటుంది.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు చెల్లుచీటి?

పాఠశాలల్లో నూతనంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేస్తున్నందున గతంలో పాఠశాల నిర్వహణలో సామాజిక బాధ్యత కోసం ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భవిత్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే నాలుగు నెలలుగా ఎస్ఎంసీ కమిటీలు పదవీ కాలం ముగిసినా ఎలాంటి నియామకాలు లేకపోగా ఇప్పుడు అదే ముఖ్యాంశాలతో ఏఏపీసీలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఇక ఎస్ఎంసీల కథ కంచికే చేరుతుందనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్ఎంసీల విధివిధానాలే ఏఏపీసీల విధివిధానాలుగా ఉండటంతో ఎస్ఎంసీలు పూర్తిగా కనుమరుగు అయినట్లేనని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఎస్ఎంసీల స్థానంలోనే ఏఏపీసీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వాటికి ప్రత్యామ్నాయంగానే ఏఏపీసీలకు ప్రభుత్వం పాఠశాలల్లో శ్రీకారం చుట్టిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏఏపీసీలు పూర్తి చేశాం..

డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హై, హనుమకొండ డీఈవో

రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మొత్తం 492 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలో పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ప్రక్రియను పూర్తి చేశాము. ఈ కమిటీల వల్ల పాఠశాలలకు ఎంతో మేలు జరుగనుంది. మహిళా సంఘాల భాగస్వామ్యంతో పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు మెరుగు పడనున్నాయి. విద్యార్థుల హాజరు శాతం పెరుగనున్నది.

రెండు జిల్లాల్లో ఇలా...

● వరంగల్ జిల్లాలో ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలలు మొత్తం 645 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు కానున్నవి. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో పూర్తి కాగా ఇంకా కొనసాగుతున్నాయి.

పాఠశాల	ప్రభుత్వ యాజమాన్యం	స్థానిక సంస్థలు
ప్రాథమిక	49	402
ప్రాథమికోన్నత	7	62
ఉన్నత	21	104

● హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు మొత్తం 492 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు అయినవి. పాఠశాలల వారిగా...

పాఠశాల	ప్రభుత్వ యాజమాన్యం	స్థానిక సంస్థలు
ప్రాథమిక	33	271
ప్రాథమికోన్నత	8	52
ఉన్నత	19	109

టెక్నీషియన్‌పై రోగి బంధువుల దాడి



గాయపడిన టెక్నీషియన్ సునిల్

వరంగల్ మెడికల్, మార్చి 27: విధి నిర్వహణలో ఉన్న ఈసీజీ టెక్నీషియన్‌పై రోగి బంధువులు దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన ఉద్యోగి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌తోపాటు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎంజీఎం ఆస్పత్రిలో బుధవారం రాత్రి 10.30 గంటలకు ఆర్. సునీల్ అనే ఈసీజీ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆక్సిజన్‌పై ఉన్న ఓ రోగికి ఈసీజీ తీస్తుండగా తేలు కాటుకు గురైన స్వప్న అనే రోగి ఈసీజీ కోసం వచ్చింది. ఆమె వెంట వచ్చిన భర్త వెంటనే తీయాలని అనగా, ఒకరి తర్వాత ఒకరికి తీస్తానని చెప్పాడు. అయినా వినిపించుకోకుండా తనపై దాడి చేసి గాయపర్చారని ఈసీజీ టెక్నీషియన్ ఆర్.సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గురుకులాల్లో దరఖాస్తులకు గడువు పెంపు

మడికొండ, మార్చి 27: తెలంగాణ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సంస్థ, గిరిజన సంక్షేమ విద్యాలయాల సంస్థలో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీసీవో మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కరీంనగర్ జిల్లా అలుగునూరు విద్యాసంస్థ, గౌలిదొడ్డి బాలికల విద్యాసంస్థలో 9వ తరగతిలో మాత్రమే రెగ్యులర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షల ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని డీసీవో పేర్కొన్నారు.

ఆలయ భూముల కబ్జాపై లోకాయుక్త విచారణ

దేవాదాయ శాఖ ఏసీ హాజరుకానందుకు అసంతృప్తి

హనుమకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోకాయుక్త కోర్టులో బుధవారం హనుమకొండలోని పద్మాక్షి, సిద్దేశ్వర, వీరపిచ్చమాంబ, రంగనాయక స్వామి, వరంగల్ వేణుగోపాలస్వామి, రాగన్నదర్వాజలోని చిన్నకోవెల దేవాలయాల భూకబ్జాపై విచారణ జరిగింది. ఈ విచారణకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హాజరు కావలసిన నేపథ్యంలో కేవలం వరంగల్ వేణుగోపాల స్వామి దేవాలయం ఈవో రత్నాకర్ రెడ్డి మాత్రమే హాజరయ్యారు. వరంగల్, హనుమకొండలోని అతి విలువైన దేవాలయాల భూముల కబ్జా లోకాయుక్త కోర్టులో ఫిర్యాదు చేసిన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు ముందు హాజరయ్యారు. సిద్ధేశ్వరాలయానికి సంబంధించి 9గుంటలు కబ్జా చేసిన కాలేజీ యాజమాన్యం, 2.15 ఎకరాలు కబ్జా చేసిన హైస్కూల్ యాజమాన్యం, రంగనాయక స్వామి దేవాలయానికి సంబంధించిన 1.14 ఎకరాలు కబ్జా చేసిన అపార్టుమెంట్ యాజమాన్యం, వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన 1.11 ఎకరాలు కబ్జా చేసిన చేసిన ఇతరులపై ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలు చేయడంలో దేవాదాయ శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణకు దేవాదాయ శాఖ ఏసీ హాజరు కాకపోవడం పట్ల లోకాయుక్త జస్టిస్ సివి రాములు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేసును జులై 10వ తేదీకి వాయిదా వేశారు. అప్పుడు ఏసీ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.


ఆటోడ్రైవర్‌పై కత్తితో దాడి

కాజీపేట, మార్చి 27: ఓ ఆటోడ్రైవర్‌పై అదే కాలనీలో ఉండే ఓ వ్యక్తి కత్తితో దాడి చేశారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట జూబ్లీమార్కెట్ నివాసి ఆటోడ్రైవర్ పల్లపు లక్ష్మణ్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి తన ఇంటిముందు ఆటో పార్కింగ్ చేసుకోవడానికి రాళ్లు అడ్డుగా ఉండటంతో రాళ్లను తీసి పక్కనే సమ్మయ్య ఇంటి ప్రహరీ వద్ద వేస్తున్నాడు. ఈ క్రమంలో సమ్మయ్య వచ్చి లక్ష్మణ్‌తో మాట్లాడుతుండగా అతడి కుమారుడు సుశీల్ కత్తితో వచ్చి లక్ష్మణ్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో లక్ష్మణ్ చెంప, మెడపై గాయాలయ్యాయి. గాయాలపాలైన లక్ష్మణ్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం అతడు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు లక్ష్మణ్ భార్య పల్లపు మహేశ్వరి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దేవుడి భూములకే శఠగోపం

▸▸ చేజారిన రూ.వందల కోట్ల విలువైన భూమి ▸▸ పద్మాక్షిగుట్ట రికార్డులు తారుమారు

▸▸ రెవెన్యూ అధికారుల గోల్‌మాల్ ▸▸ స్పందించని దేవాదాయ శాఖ



పద్మాక్షిగుట్ట

హనుమకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖ నిద్రలో జోగుతోంది. కళ్లముందే కోట్లాది రూపాయల విలువైన దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నా చలనం లేదు. నగరంలోని పలు ప్రాచీన, సుప్రసిద్ధ ఆలయాలకు చెందిన భూముల్లో చాలా వరకు ఇప్పటికే అన్యాక్రాంతం అయ్యాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు కబ్జాలకు గురైన తర్వాత ఆలస్యంగా కళ్లు తెరుస్తోంది. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. అసలు ఏ దేవాలయం కింద ఎంత భూమి ఉందనే విషయం కూడా దేవాదాయ శాఖకు స్పష్టంగా ఇప్పటికీ తెలియదు. ఆలయాలకు చెందిన భూముల రికార్డులు మారినా ఆ శాఖకు సోయి లేదు. ఎందుకు మారింది? ఎవరు మార్చారు.. అన్నది కనీసం తెలుసుకునే ప్రయత్నమూ చేయడం లేదు. దీనితో వందల కోట్ల రూపాయల విలువైన ఆలయ భూములు పరాధీనం అవుతున్నాయి. హనుమకొండ పట్టణం నడిబొడ్డున ఉన్న సుప్రసిద్ధ పద్మాక్షి దేవాలయం గుట్ట భూములే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. వివరాల్లోకి వెళితే..

ఒకప్పుడు..

పద్మాక్షి ఆలయం అత్యంత ప్రాచీనమైనది. కాకతీయుల కాలం కన్నా ముందునాటిది. దీనిని ఒకప్పుడు జైన దేవాలయంగా పిలిచేవారు. ఇందులో ఉన్న అమ్మవారిని కూష్మాండినిగా కొలిచేవారు. తర్వాతకాలంలో పద్మాక్షిగుడిగా మార్పు చెందింది. హనుమకొండ నడిబొడ్డున విశాలమైన గుట్టపైన ఈ ఆలయం ఉంది. కనుకనే ఇది పద్మాక్షిగుట్టగా ప్రాచుర్యం పొందింది. నాటి పాలకులు ఈ గుడి ఉన్న గుట్టతో పాటు దాని చుట్టూ ఉన్న వంద ఎకరాలకుపైగా భూమిని మాన్యంగా ఇచ్చేశారు. 1961-62 సంవత్సరం వరకు రెవెన్యూ రికార్డుల్లో పద్మాక్షి గుట్ట, దాని చూట్టు ఉన్న స్థలం పద్మాక్షి గుడికి చెందినదిగానే రికార్డులో ఉంది. హనుమకొండ బస్‌స్టాండ్ వైపు సర్వే నెంబరు 898లో ఉన్న ఈ గుట్ట మొత్తం విస్తీర్ణం 78 ఎకరాలు. పద్మాక్షిగుడి ముందు భాగాన రోడ్డును ఆనుకొని 9 సర్వే నెంబర్లలో 16.4 గుంటల స్థలం ఉంది. ఈ స్థలంలో కొంత భాగం అన్యాక్రాంతం అయింది.

రికార్డుల్లో మార్పు

1961 తర్వాత కాలంలో రెవెన్యూ రికార్డులు తారుమారు అయ్యాయి. పహణీలో పద్మాక్షిగుట్టగా ఉన్న ఈ ప్రాంతాన్ని పోరంబోకుగా మార్చారు. దీనితో అప్పటి వరకు పద్మాక్షి గుడి పరిధిలో ఉన్న ఈ స్థలం రెవెన్యూశాఖ ఆధీనంలోకి వెళ్లి పోయింది. దేవాదాయశాఖ దీనిని పట్టించుకోలేదు. పద్మాక్షి గుడి తమ ఆధీనంలోకి వచ్చిన తర్వాత దానికింద ఎంత భూమి ఉంది, ఎక్కెడెక్కడ ఉన్నది? ఎంత విస్తీర్ణంలో ఉంది? పరిశీలించలేదు. పద్మాక్షి గుడి ముందు భాగాన ఉన్న 16 ఎకరాల 4 గుంటల స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న దేవాదాయశాఖ.. మొత్తం గుట్టను, దానిని ఆనుకొని ఉన్న స్థలాన్ని మాత్రం పట్టించుకోలేదు. 1961 వరకు రెవెన్యూ రికార్డుల్లో పద్మాక్షిగుట్ట అని ఉండి ఆ తర్వాత పోరంబోకుగా ఎందుకు మారింది? ఎవరు మార్చారు? దీనికి కారకులు ఎవరనేది పరిశీలన చేయలేదు. కనీసం అభ్యంతరం కూడా తెలపలేదు. పద్మాక్షిగుట్ట విషయమై దేవాదాయ శాఖ పట్టించుకుని ఉంటే ఎంతో విలువైన భూమి ఆ శాఖకు దక్కి ఉండేది. అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించారు. దీనితో గుట్ట, దాని చుట్టూ ఉన్న 78 ఎకరాల స్థలం దేవాదాయ శాఖ నుంచి చేజారిపోయింది. ఈ స్థలం విలువ ప్రస్తుతం మార్కెట్‌లో కొన్ని వందల కోట్ల రూపాయల విలువ చేస్తుంది. నగరం నడిబొడ్డున సరిగ్గా హనుమకొండ బస్‌స్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఈ గుట్ట స్థలం మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. లక్ష విలువ చేస్తుంది. ఆ లెక్కన రూ.800కోట్లు చేస్తుందని అంచనా.

గుట్ట విధ్వంసం

పద్మాక్షిగుట్టను పోరంబోకు భూమిగా రికార్డుల్లో మార్చిన తర్వాత గుట్ట విధ్వంసం మొదలైంది. 1960 ముందు నాటి వరకు ఈ గుట్టను పద్మాక్షి అమ్మవారు వెలిసిన అత్యంత పవిత్రమైన ప్రాంతంగా భావించేవారు. గుట్ట వద్ద క్వారీ విచ్చల విడిగా సాగింది. బండరాళ్ల కోసం గుట్టను దారుణంగా ధ్వంసం చేశారు. గుట్టను ఆశ్రయించి జీవనోపాధి పొందుతున్న సుమారు 80మంది వడ్డెరలకు ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు. గుట్ట ముందు బస్‌స్టేషన్ నిర్మాణం జరిగిన తర్వాత ఈ స్థలానికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇదే అవకాశంగా తీసుకున్న కొందరు వడ్డెరలను ప్రలోభపెట్టి వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలను కారు చౌకగా కొనుగోలు చేశారు. అంతటితోనే ఆగకుండా ఆ స్థలాలను ఆనుకొని ఉన్న మిగతా ఖాళీ భూములను కూడా క్రమంగా ఆక్రమించుకోవడం మొదలు పెట్టారు.

లోకాయుక్త ఆదేశించినా..

నగరంలోని దేవాలయాల భూముల పరిరక్షణ కోసం గత కొంతకాలంగా పోరాటం చేస్తున్న వినియోగదారుల మండలి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, చీకటి రాజు పద్మాక్షి గుట్ట అన్యాక్రాంతంపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన లోకాయుక్త రెండేళ్ల కిందట సర్వేకు ఆదేశించింది. పద్మాక్షిగుట్ట, దాని అనుకొన్నిఉన్న ప్రభుత్వ దేవాదాయ భూమి ఏ మేరకు కబ్జా అయింది వివరాలను సమర్పించవలసిందిగా కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ ఏసీ, ల్యాండ్ రికార్డు సర్వే ఏడీకి నోటీసులు పంపింది. గుట్ట సర్వేను ల్యాండ్ రికార్డుల సర్వే శాఖ కొంత మేరకే నిర్వహించి సిబ్బంది కొరత సాకుతో ఆ తర్వాత చేతులెత్తేసింది. రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకు సర్వే జరగలేదు. పద్మాక్షిగుట్ట ప్రాంతంలో పాటు నగరంలోని పలు దేవాలయాల భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు విచారణ జరిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు బదులు కింది స్థాయి ఈవో హాజరు కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జులై 10వ తేదీన జరిగే తరుపరి విచారణకు ఏసీ ఖచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 27: భారీగా పెంచిన టెట్ ఫీజును తగ్గించి నిరుద్యోగులపై భారాన్ని తగ్గించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి హకీం నవీద్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులు వేల రూపాయలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకొని ప్రభుత్వ అసమర్థతవల్ల పరీక్షలు రాయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిరుద్యోగులు ఆర్థికంగా, మానసికంగా నష్టపోయారని, వారందరికీ న్యాయం జరగాలంటే టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని డిమాండ్ చేశారు.

పోరాటాలు వర్ధిల్లాలి.. ప్రశ్నించే గొంతుకలు ఉండాలి

కుంజ రాము వర్ధంతి సభలో మంత్రి సీతక్క



మొకాళ్లపల్లిలో కుంజ రాము స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, మార్చి27 : పోరాటాలు వర్ధిల్లాలు.. ప్రశ్నించే గొంతుకలు ఉన్నప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క అన్నారు. కొత్తగూడ మండలం మోకాళ్లపల్లిలో ఏఎల్టీ వ్యవస్థాపకుడు, మంత్రి సీతక్క భర్త కుంజ రాము 19వ వర్ధంతిని రాము కుటుంబసభ్యులు, అభిమానులు, ఆదివాసీలు మంగళవారం నిర్వహించారు. తొలుత కుంజ రాము స్థూపం వద్ద మంత్రి సీతక్కతోపాటు కుమారుడు సూర్య, కోడలు కుసుమాంజలి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన వర్ధంతి సభలో ఆమె మాట్లాడుతూ భూమి కోసం.. భుక్తికోసం.. పేద ప్రజల విముక్తి కోసం రాము పోరాటాలు చేశారన్నారు. భూములు పేదలకు పంపిణీ చేశారని పేర్కొన్నారు. నాడు ఉద్యమంలో ఈ ప్రాంతంలో రాముతో కలిసి పనిచేసినప్పుడు స్థానిక ప్రజలు ఆదరణ చూపించి, అండగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో పోరాటాలు, ఉద్యమకారులు ఉండాల్సిందేనన్నారు. నాడు పోరాటాలు, ధర్నాలు వద్దని చెప్పిన వారే.. నేడురోడ్లు ఎక్కి ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆదివాసీ హక్కుల కోసం, పేద ప్రజల అభివృద్ధి కోసం కుంజ రాము అనేక పోరాటాలు చేపట్టారన్నారు. నాటి పోరాట ఫలితంగానే పలు గ్రామాలు వెలిశాయని పేర్కొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడిన వారిని మరువొద్దు..

ప్రజలందరూ ప్రజాసమస్యలపై పోరాడిన వ్యక్తులను, వారి సేవలను మరువకూడదని సీతక్క పేర్కొన్నారు. నలుగురి కోసం పనిచేస్తేనే నలుగురిలో ఉంటామని అన్న అంబేద్కర్ స్ఫూర్తితోనే కుంజ రాము ప్రజల కోసం విప్లవబాట పట్టారని పేర్కొన్నారు. ఉద్యమకారులు, విప్లవకారుల ఆశయ సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే పేదల హక్కు లు కాపాడుతామని, వారికి భూములు ఇస్తామని, ఇళ్లు కట్టిస్తామని, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ కల్పన కల్పిస్తామని పేర్కొన్నారు. కులాల పేరిట కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. నాడు విప్లవకారులు కొట్టించిన పోడు భూములకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సోనియాగాంధీ హక్కులు కల్పించారని, పోడు భూములకు ఏడు విడతలుగా హక్కుపత్రాలు, పట్టాలు ఇచ్చారని చెప్పారు. కుంజ రాము పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి, పేద ప్రజలకు తగు సేవలు చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, పలు సంఘాల నాయకులు, మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, మాజీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, కుంజ రాము కుటుంబసభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్

టెట్ అర్హత లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 27: టెట్ అర్హత లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌కుమార్ మాట్లాడుతూ... ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం టెట్ అర్హతను నిబంధనగా పెట్టడం సరికాదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం మాత్రం కావడం లేదని ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు రాకపోవడం ప్రభుత్వాల వైఫల్యంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నా ప్రభుత్వాలు మాత్రం విద్యారంగంపై ఇంకా చిన్న చూపే చూస్తున్నాయని విమర్శించారు. బదిలీలు పొందిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23న రిలీవ్ చేయాలన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. త్వరలో ఉద్యోగ విరమణ పొందబోతున్న ఉపాధ్యాయులకు వెంటనే గ్రాట్యుటీ, సర్వీస్ బెనిఫిట్స్ తదితరాలను వెంటనే చెల్లించాలన్నారు. సర్వీస్ పర్సన్లను వెంటనే నియమించి పాఠశాలల్లో కనుమరుగైన పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. పెండింగ్ డీఏల చెల్లింపుల కోసం ప్రభుత్వం ఉత్తర్వులివ్వాలన్నారు. ప్రభుత్వం విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్మిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రమేష్, గుంటి ఎల్లయ్య, మనోహర్‌రాజు, రఘుపతి, వెంకటేశ్వర్లు, జగపతిరావు, బెల్లంకొండ రమేష్, బైరి స్వామి, గోవర్ధన్, శ్రీరామ్, సోమేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, రమేష్, వెంకన్న, లక్ష్మణ్, రమేష్, కొమురయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సు లో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీవాత్సవ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 27: ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక సాంకేతికత కొంత పుంతలు తొక్కుతున్న తరుణంలో అభివృద్ధి కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ అన్నారు. బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఫినెటిక్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెస్ శ్రీవాత్సవ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఫినెటిక్ రూపాంతరం చెందుతోందని, ఆర్థికసేవలు పూర్తిగా డిజిటలైజేషన్ అయ్యాయన్నారు. ఏ చిన్న వస్తువు కొనుగోలు చేయాలన్నా డిజిటల్ మార్కెట్ వైపే వెళ్లాల్సి వస్తోందన్నారు. బ్యాంకింగ్ రంగం పూర్తిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, సాఫ్ట్ టెట్ సిస్టమ్స్ హెచ్ఆర్ డైరెక్టర్ నరీన్ మాట్లాడుతూ.. ఇంటర్నెట్ విధానంతోకూడిన స్మార్ట్ ఫోన్‌తోనే ప్రపంచం మొత్తం వ్యాపార రంగాన్ని కొనసాగిస్తుందన్నారు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే వస్తువు మన ఇంటి ముందర ఉన్నట్లేనన్నారు. బ్యాంకులకు వెళ్లకుండా ఇంటి నుంచే ఆర్థిక లావాదేవీలు చేసుకునే వీలును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కల్పించిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, కళాశాల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ డీన్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ అమరవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కనకయ్య, ప్రొఫెసర్ రాజేందర్, డాక్టర్ గిరిప్రసాద్, పీఆర్వో డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్పాట్ రెమ్యూనరేషన్ చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 27 : గత ఏడాది నిర్వహించిన టెన్త్ స్పాట్ రెమ్యూనరేషన్ ఇప్పటి వరకు రాలేదని, ఈ సంవత్సరం స్పాట్ కంటే ముందుగానే గత ఏడాది స్పాట్ రెమ్యూనరేషన్ ఇవ్వాలని పీఆర్టీయూ-తెలంగాణ జిల్లా అధ్యక్షురాలు కొలేపాక సంగీత డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ బాబ్జీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం సంగీత మాట్లాడుతూ... వికలాంగులకు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న వారికి, రిటైర్డ్ కాబోతున్న వారికి స్పాట్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. స్పాట్ క్యాంపులో ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ఎం.సర్వేశ్వర్, రాయపర్తి మండల అధ్యక్షుడు ఎం.నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జె.సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

వేతనాలు అందక జీపీ సిబ్బంది వెతలు

● 4 నుంచి 8 నెలల వరకు అందని జీతం ● కుటుంబ పోషణ కోసం ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ

సంగెం, మార్చి 27: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి గత నాలుగు నుంచి ఎనిమిది నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 132 మందికి వేతనాలు లేకపోవడంతో కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్తుండగా, పలువురు సిబ్బంది గ్రామాల్లో పడేసిన వాటర్ బాటిళ్లను సేకరించి అమ్ముతూ కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నారు. గత పాలకవర్గంలో పనిచేసిన సిబ్బందికి వేతనాలు చెల్లించక పోవడంతో పేరుకుపోయాయి. సర్పంచ్‌ల పదవీ కాలం గత జనవరితో ముగిసింది. అంతకుముందు సర్పంచ్‌లు వేతనాలు చెల్లింపుకు సంబంధించిన బిల్లులు బకాయి పడిపోయాయి. ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలైనప్పటికి సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు చెల్లించడంలో అధికారులు కాలాయాపన చేస్తున్నారు. సర్పంచ్‌లు పదవిలో కొనసాగినంత కాలం గ్రామపంచాయతీ సిబ్బందికి సర్పంచ్‌కు పవర్ ఉండటంతో చెక్కు రాసి బ్యాంకులకు పంపే వారు. దీంతో సిబ్బందికి వేతనాలు అందించే వారు.

పేరుకుపోయిన వేతన బకాయిలు

గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన సర్పంచ్‌లు గ్రామాల్లో పనిచేసిన అభివృద్ధికి సంబంధించిన బిల్లులు అందకపోవడంతో నాటి సర్పంచ్‌లు తమ బిల్లులను రాబట్టుకునేందుకు ముందస్తుగా గ్రామపంచాయతీ ఖాతాల్లో జమ అయిన నిధులను నిలిపినట్లు తెలిసింది. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ, ఫైనాన్స్ సంఘంతో పాటు కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించే వారు. దీంతో గ్రామపం చాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి రెండు మూడు నెలలకోమారు వేతనాలు అందించే వారు. దీంతో సిబ్బందికి వేతనాలను అందించడంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నెలల తరబడి పని చేసినప్పటికి వేతనాలను అందించకుండా తమను చిన్నచూపు చూశారని చెబుతున్నారు. దీంతో కుటుంబ పోషణ భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో గ్రామపంచాయతీలో నాలుగు నుంచి ఎనిమిది నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆత్మహత్యలే తమకు శరణ్యమని చెబుతున్నారు. సిబ్బంది ఒక్కొక్కరికి నెలకు రూ.9,500 అందిస్తున్నారు. గ్రామంలో 500 జనాభా కనుగుణంగా ఒక్కరిని నియమించుకునే అవకాశం ఉంది.

ప్రత్యేకాధికారుల నిర్లక్ష్యం

గ్రామాలకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధిరులు గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిసింది. గత సర్పంచ్‌ల పదవి కాలంలో బకాయి పడిన వేతనాలను తాము చెల్లించేది లేదని చెబుతున్నారని సిబ్బంది వాపోతున్నారు. గ్రామపంచాయతీల ఖాతాల్లో నిధులున్నప్పటికి చెల్లించక నానా ఇబ్బందులు పెడుతున్నారని, ఈ విషయం మండల అధికారులకు తెలిసినప్పటికి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంగెంలో పాత బాటిళ్లను సేకరించుకుంటున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

33 గ్రామాల్లో 132 మంది సిబ్బంది

మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 132 మందిలో కారొబార్, పంపు ఆపరేటర్, విద్యుత్ దీపాలంకరణ, పారిశుధ్యం తదితర పనులు చేసే వారందరికి ఒకే వేతనం అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో గ్రామాలకు ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నది. గ్రామ పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధుల నుంచి వేతనాలు అందించాల్సి ఉండగా అధికారులు ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఉత్తర్వులు లేవని చెబుతున్నారు.

పశు వైద్యాధికారుల డైరీ ఆవిష్కరణ

వరంగల్ కలెక్టరేట్, మార్చి 27 : పశు వైద్యాధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరం డైరీని కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలకృష్ణ, జిల్లా పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వడ్డెపల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వల్లె రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ వడ్డెపల్లి సోమశేఖర్, కోశాధికారి డాక్టర్ ఎం.రాజేందర్, జాయింట్ సెక్రటరీ డీఆర్‌బి.ఝాన్సీ, ఈసీ మెంబర్స్ డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ జే.మంజిలాల్, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

గిర్మాజిపేట, మార్చి 27 : వరంగల్ రైల్వేస్టేషన్ సమీప ంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్టు వి101ఏ తో కలిసి హరిప్రియా ఫీడ్స్ ఏర్పాటు చేసిన చలివేంద్రం ను బుధవారం వాసవి క్లబ్ డిస్ట్రిక్టు క్యాబినెట్ సెక్రట రీ వి.నూతన్ కుమార్, గుండా అమర్‌నాథ్‌లు ప్రారంభించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం లో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో చల్లని 80 లీటర్ల ఆర్‌వోఆర్ తాగునీరు నిత్యం అందుబాటులో ఉంటు ందని చెప్పారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బాటసారులు ఈ చలివేంద్రం సేవలను వినియోగిం చుకోవాలని వారు కోరారు. చలివేంద్రం నిర్వాహకులు వేములపల్లి సునీల్‌కు మార్ పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా మదన్‌కుమార్

వరంగల్‌సిటీ, మార్చి 27: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ గుండాల మదన్‌కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించిన అనంతరం మదన్‌కుమార్‌కు జిల్లా బాధ్యతలు అప్పగిం చినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. తెలంగాణ ఉద్యమం లో పనిచేయడంతో పాటు కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడిగా, ముదిరాజ్ సామాజిక వర్గానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, వరంగ ల్‌లో పేరున్న డాక్టర్‌గా మదన్‌కుమార్‌కు గుర్తింపు ఉన్నందున బహుజన వాదాన్ని ముందుకు తీసుకువెళతారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌తో డాక్టర్ మదన్‌కుమార్

నిర్ధిష్ట గడువులోపు పన్నులు చెల్లించాలి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 27: ఈనెల 31 వరకు మునిసిపల్ పరిధిలో చెల్లించే అన్నిరకాల పన్నులను నిర్ధిష్ట గడువులోపు చెల్లించాలని సీడీఎంఏ దివ్యదేవరాజన్ అన్నారు. బుధవారం హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని మునిసిపల్ కమిషనర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ నగర పాలక కార్యాలయం నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లలో వార్షిక లక్ష్యాలను చేరుకోవడానికి చాలా తక్కువ సమయం ఉందని, అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. కనీసం 90శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. అశ్విని తానాజీ వాకడే వివరణ ఇస్తూ.. వార్షిక పన్నుల లక్ష్యం రూ.90కోట్లు కాగా, 71శాతం వసూలు చేశామని స్పష్టం చేశారు. అంతే కాకుండా 300 చదరపు గజాల ఇళ్ల నిర్మాణంలో ప్రతీ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను తీసే విధంగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను దివ్య దేవరాజన్ అభినందించారు. అనంతరం కమిషనర్ స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిటీ ప్లానర్ బానోతు వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ఈఈలు సంజయ్‌కుమార్, ఐటీ అధికారి రమేష్‌లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 27: ఓటర్లను చైతన్య పర్చేందుకు రూపొందించిన జిల్లా స్వీప్ కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమాలపై సంబంధిత నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం జరిగిన అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహి ంచాలని సూచించారు. ఓటరుగా నమోదు చేసుకోని అర్హత గల వారు ఏప్రిల్ 15వ తేదీ లోగా ఓటరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా నమోదుకు వివిధ ప్రచార మాధ్యమాలతో విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. మహిళా సమాఖ్యలు, స్లమ్ లెవల్, టౌన్ లెవల్ సమాఖ్యల ద్వారా మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునేలా 2కే రన్, 5కే రన్, ఫ్లాష్ మాబ్ తదితర వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రతి గడపకు ఓటరు స్లిప్‌లు పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీఈవో వాసంతి, ఇండస్ట్రీస్ జీఎం నరసింహమూర్తి, డీపీవో కల్పన, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఓటు ప్రాధాన్యతపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి ● మెప్మా కార్యాలయంలో స్వీప్-2024 అవగాహన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 27 : ప్రతీ ఒక్కరికి ఓటు ప్రాధాన్యతపై అవగాహన అవసరమని జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో తెలుగుతల్లి పట్టణ సమాఖ్య సభ్యులకు ఓటు చైతన్యంపై స్వీప్-2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి పట్టణ సమాఖ్య సభ్యుల సహకారం అవసరం అన్నారు. 18 యేళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కు నమోదుపై చైతన్యం తీసుకురావాలని అన్నారు. సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించా లని అన్నారు. ఓటు నమోదు కార్యక్రమంలో అందజేసిన ఎపిక్ కార్డు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని అన్నారు. అంతే కాకుండా వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 యేళ్లు నిండిన యువత 19 వేల మంది ఉన్నారని, ఇప్పటికీ 3వేల మంది మాత్రమే ఓటరుగా నమోదు చేసుకున్నారని అన్నారు. మిగిలిన వారు పూర్తిస్థాయి ఓటరుగా నమోదు చేసుకునే విధంగా దృష్టి సారించి ఓటింగ్ శాతం పెంచాలని సూచించారు. అనంతరం పట్టణ సమాఖ్య సభ్యులచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌వో రాజేశ్‌కుమార్, టీ.ఎం రమేష్, యుబీఐ బ్యాంకు మేనేజరు సంజీవ్, సీవోలు రజిత, రమ, నాగరాజు, ప్రవీణ్, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కాంగ్రెస్ అధికార ప్రతినిధుల నియామకం

జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ సిటీ, మార్చి 27: జిల్లాలోని సంగెం మండలం గవిచర్లకు చెందిన ప్రముఖ న్యాయవాది రావుల శ్రీనివాస్‌రెడ్డి జిల్లా డీసీసీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వరంగల్ జిల్లా డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి, ఏఐసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా అండ్ కమ్యూనికేషన్ కమిటీ ఇన్‌చార్జి సుజాత పాల్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీనివాస్‌రెడ్డి 20 ఏళ్లగా నిబద్ధతతో, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తారని ఈ పదవిని అప్పగించడం జరిగిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రావుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

● గీసుగొండ : పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా గీసుగొండ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు చాడా కొమురారెడ్డిని నియమించారు. ఈ మేరకు హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో బుధవారం కొమురారెడ్డికి ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతపాల్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక పత్రాన్ని అందచేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి చాడా అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే, జిల్లా, రాష్ట్ర నాయకులకు కొమురారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంచి వాగ్ధాటి గల చాడాను అధికార ప్రతినిధిగా నియమించారని కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో కార్యకర్తలు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు.

● సంగెం : పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా జనగాం రమేష్ నియమితులయ్యారు. సంగెం మండలం ఎల్గూరు రంగంపేట గ్రామానికి చెందిన రమేష్‌ను అధికార ప్రతినిధిగా నియమిస్తూ బుధవారం ఏఐసీసీ స్పోక్ పర్సన్ సుజాత పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పత్రాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి హనుమకొండలోని తన నివాసంలో రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, మండల నాయకులు అచ్చ నాగరాజు పాల్గొన్నారు.





నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి (ఇన్‌సెట్)లో శ్రీనివాస్‌రెడ్డి

సిద్ధాంత గ్రంథాలు మంచి పాఠ్యాంశాలుగా నిలవాలి

▸▸ జానపద గిరిజన విజ్ఞాన పీఠాధిపతి బాబురావు

వరంగల్ కల్చరల్, మార్చి 27: పరిశోధక విద్యార్థులు సమర్పించే సిద్ధాంత గ్రంథాలు ముందు తరాల విద్యార్థులకు మంచి పాఠ్యాంశాలుగా నిలవాలని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భుక్యా బాబురావు అన్నారు. బుధవారం వరంగల్ హంటర్ రోడ్డులోని గిరిజన విజ్ఞాన పీఠంలో జరిగిన కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి వల్స పైడి పరిశోధన చేసిన తెలంగాణలోని మాల ఉప కులాల సామాజిక, సాంస్కృతిక జీవితం, సాహిత్య పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ సబ్ మిషన్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాబురావును సన్మానించారు. కార్యక్రమంలో పీఠం అసిస్టెంట్ డాక్టర్ శ్రీమంతుల దామోదర్, చూరపల్లి రవికుమార్, బాసని సురేష్, గోపాల్‌రెడ్డి, గంప సతీష్, సునంద, ఆంజనేయులు, కస్తూరిబాయి, మోహన్, చిందు యక్షగాన కళాకారులు ఏసోబు, నోముల రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మట్టెవాడ, మార్చి 27 : వరంగల్ మట్టెవాడలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల పోస్టర్, కరపత్రాన్ని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు బుధవారం ఆవిష్కరించారు. ఏప్రిల్ 2 నుంచి 7 వరకు మట్టెవాడలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ తోట నవీన్‌కుమార్, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేష్ తెలిపారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ తేజస్వి శిరీష్, ఆకుతోట శిరీష్, వరంగల్ బులియన్ మర్చంట్ ఉపాధ్యక్షుడు తోట హరీష్, రజినీకాంత్, కొత్త వెంకటకృష్ణ, ఇరుకుళ్ల నాగేశ్వర్‌రావు, దివ్వెల నాగరాజు, శ్రీనివాస్, నీల రాజన్న, మీసాల ప్రకాష్, ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు

బాలల అక్రమ రవాణాను నిర్మూలించాలి

గిర్మాజిపేట, మార్చి 27 : బాలల అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరంగల్ బాలల సంరక్షణ సమితి చైర్‌పర్సన్ కె.వసుధ అన్నారు. బుధవారం వరంగల్‌లోని ఓసిటి గ్రౌండ్‌లో ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ, ఉమ్మడి వరంగల్ మినీ వ్యాన్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన 'బాలల అక్రమ రవాణా నిర్మూలనలో డ్రైవర్ల పాత్ర' సదస్సులో వసుధ మాట్లాడారు. తెలిసి తెలియక ఇంటి నుంచి వచ్చిన బాలలను గుర్తించి అక్రమ రవాణాదారులు వారిని విక్రయిస్తూ భిక్షాటన, వ్యభిచారం చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లు, ఆర్టీసీ బస్‌స్టేషన్‌లు, రైల్వే స్టేషన్‌లలో అనుమానాస్పదంగా, ఒంటరిగా బాలలు కనిపిస్తే వెంటనే 100 నెంబర్‌కు కాల్ చేసి పోలీసులకు, 1098 నెంబర్‌కు కాల్‌చేసి చైల్డ్‌లైన్‌లకు సమాచారమిస్తే సంబంధిత బాలలను రక్షించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా నిరోధక పోలీసు విభాగం ఎస్సై ఫసియొద్దీన్, వరంగల్ బాలల సంరక్షణ సమితి లీగల్ ప్రతినిధి సురేష్‌కుమార్, ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు బి.కరుణ, వై.శ్రీకాంత్, ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈ.సుదర్శన్, మినీ వ్యాన్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి మహేందర్, కోశాధికారి ప్రసాద్, రాజు, పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాస్, డ్రైవర్లు పాల్గొన్నారు.



బాలల అక్రమ రవాణా నిర్మూలనపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆయుర్వేద మందులపై అవగాహన ఉండాలి

గిర్మాజిపేట, మార్చి 27 : ఆయుర్వేద మందుల వినియోగంలో రోగులకు కలిగే దుష్పరిణామాలపై ఆయుర్వేద వైద్యులు పూర్తి స్థాయిలో సరైన అవగాహన కలిగి ఉండాలని ఆయుష్ వరంగల్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవినాయక్ ఆయుర్వేద వైద్యులకు సూచించారు. బుధవారం వరంగల్ నగరంలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలోని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పెరిఫెరల్ ఫార్మకోవిజిలెన్స్ సెంటర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ అధ్యక్షతన ఫార్మకోవిజిలెన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఆయుర్వేద మందుల వినియోగంలో రోగులకు ఎలాంటి దుష్పరిణామాలు కలిగినా సంబంధిత ఆయుర్వేద వైద్యులు రోగి పరిస్థితిని ఫార్మకోవిజిలెన్స్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌కు అందచేయాలని చెప్పారు. ఫార్మకోవిజిలెన్స్ సెంటర్ పనితీరుపై డాక్టర్ శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ వరంగల్ ప్రాంతీయ పరిధిలోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి, ఆయుర్వేద డిస్పెన్సరీల మెడికల్ ఆఫీసర్లు, అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల బోధనా సిబ్బంది, ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్సులు, పంచకర్మ థెరపిస్టులు పాల్గొన్నారు.

రేపు కొమ్మాల నరసింహుడి రథోత్సవం

గీసుగొండ, మార్చి 27: మండలం లోని కొమ్మాల లక్ష్మీనరసి ంహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమై న స్వామి వారి రథోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహిం చనున్న ట్లు ఆలయ ఈవో శేషగిరిరావు, ధర్మ కర్తలమండలి చైర్మన్ శ్రీనివాసా చార్యులు తెలిపారు. రథోత్సవం కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. ఉత్సవమూర్తులైన నరసింహస్వామి, భూదేవి, నీలాదేవిలను పట్టు వస్త్రాల తో అందంగా అలంకరించి రథంలో కూర్చోబెట్టి రాత్రి 8 గంటలకు వైభవంగా ఆలయ గుట్ట చుట్టు భక్తుల గోవిం ద నామస్మరణలతో ప్రదక్షిణలు చేయటం జరుగుతుందని వివరించారు. ఉత్సవమూర్తులు ఆసీనులైన రథాన్ని ముట్టుకున్నా, లాగినా పుణ్యఫలం లభిస్తుందని భక్తులకు అపారమైన నమ్మకం. స్వామి వారి రథోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తన్మయత్వంలో మునిగిపోతారు.





జాతీయ స్థాయి పోటీలకు కావ్యశ్రీ ఎంపిక

దుగ్గొండి, మార్చి27: మండలంలోని మల్లంపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జనగాం కావ్యశ్రీ సాఫ్ట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైంది. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీలు అదిలాబాద్‌లో నిర్వహించగా కావ్యశ్రీ పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం భద్రమ్మ, పీఈటీ వీరగోని స్వప్నలు బుధవారం తెలిపారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 1వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. విద్యార్థి ప్రయాణ ఖర్చులకు హెచ్‌ఎం భద్రమ్మ, రూ.2000, ఉపాధ్యాయులు రఘునాథ్, రూ. 1000, బెజుగం సురేశ్ రూ. 1000లు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కావ్యశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.



పాపయ్యపేటలో హోమ పూజలు నిర్వహిస్తున్న గౌడ కులస్థులు

కంఠమహేశ్వర స్వామి ఉత్సవాల్లో హోమం

చెన్నారావుపేట, మార్చి 27: మండలంలోని పాపయ్యపేటలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలల్లో భాగంగా గౌడ కులస్థులు బుధవారం హోమ పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా కంఠమహేశ్వర ఆలయంలో వేదమంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, పుణ్యావాచనంతోపాటు పలు పూజలను నిర్వహించారు. అగ్నిహోమ పూజలను నిర్వహించారు. నేడు ఆలయంలో కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామిగౌడ్, కులపెద్ద మేడి ప్రభాకర్, మేడి రమేష్ గౌడ్, బుర్ర సుదర్శన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బండి రమేష్‌గౌడ్, మేడి భిక్షపతి, తాళ్ల సమ్మయ్య, మేడి వెంకన్న గౌడ్, బుడిగే నరేందర్‌గౌడ్, బుడిగే వెంకన్నగౌడ్, మేడి రాముగౌడ్, దేవేందర్‌గౌడ్, గండు రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నారం తైబజార్ వేలం పాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

పర్వతగిరి, మార్చి 27: మండలంలోని అన్నారంషరీఫ్ గ్రామంలో తైబజార్ వేలంపాట 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.33.95 లక్షలకు ఖరారైనట్లు ఎంపీవో, స్పెషల్ ఆఫీసర్ పాక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలో గ్రామానికి చెందిన ఎస్‌కే.సమీన్ దక్కించుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ షబ్బీర్, కార్యదర్శి మోహినుద్దీన్, యాకయ్య పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా మదన్‌కుమార్



మదన్‌కుమార్‌ను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

నర్సంపేట, మార్చి 27 : బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్‌పి) జిల్లా అధ్యక్షుడిగా నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న గుండాల మదన్‌కుమార్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ నియమించారు. మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మదన్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో బీఎస్పీని బలోపేతం చేయడానికి, ఎస్సీ ఎస్టీ, బీసీ హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌కు, రాష్ట్ర నాయకులకు మదన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామసింహాలతో బెంబేలు..

• రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్న ప్రజలు
• పట్టించుకోని అధికారులు
• చర్యలు చేపట్టాలంటున్న పలువురు

నెక్కొండ, మార్చి 27: విశ్వాసానికి మారు పేరుగా చెప్పుకునే గ్రామ సింహాలు (కుక్కలు) ప్రస్తుతం ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామాల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ పాఠశాలకు వెళ్లే పిల్లలు, గ్రామాల్లోని ప్రజలు, కోళ్లు, పశువులు, మేకలు, గొర్రెలపై విచక్షణా రహితంగా దాడులు చేయడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిపై దాడులు చేస్తుండడంతో వారు సైతం గాయాలపాలవుతున్నారు.

మండలంలోని సూరిపల్లిలో కొన్ని నెలల క్రితం పలువురు రైతులకు చెందిన గేదెలు కుక్క కాటుకు గురికావడంతో 20 నుంచి 35 పశువులు ర్యాబీస్ వ్యాధితో మృత్యువాత పడినట్లు గ్రామస్థులు తెలిపారు. నాగారం, వెంకటాపురం గ్రామాల్లో గొర్రెల మందపై కుక్కల దాడి కారణంగా 40 మేకలు మృత్యువాత పడ్డాయి. అదేవిధంగా నెక్కొండ, అప్పల్‌రావుపేట, గుండ్రపల్లి, దీక్షకుంట, సాయిరెడ్డిపల్లి గ్రామాల్లో పలువురు కుక్కకాటుకు గురై అలంకానిపేట, నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందారు.

విచ్చలవిడిగా సంచారం..

మండలకేంద్రంలోని వీధులవెంట కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. వీటికితోడు నెక్కొండలో ప్రతీ వారం జరిగే సంతలో విక్రయించుటకు గ్రామాలనుంచి పలువురు పశువులు, గొర్రెలు, మేకలను తీసుకు వస్తుంటారు. వాటి వెంట గ్రామాల నుంచి వచ్చిన కుక్కలకు రైల్వే ట్రాక్ వెంట ప్రమాదాలకు గురయిన జంతువులు, మనుషుల కుళ్లిన మాంసం దొరుకుతుండటంతో వాటిని తిని ఇక్కడే ఉండిపోతున్నాయి. అయితే ఈ కుళ్లిన మాంసం తినడంతో మంచి కుక్కలు సైతం త్వరగా పిచ్చికుక్కలుగా మారుతున్నట్లు పశువైద్యులు చెపుతున్నారు.



నెక్కొండలోని నందమూరినగర్‌లో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

నియంత్రణ చర్యలు శూన్యం

గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరించే పిచ్చికుక్కల నియంత్రణకు గతంలో పంచాయతీ పాలకులు, అధికారులు చర్యలు తీసుకోనేవారు కానీ.. కోర్టు నిబంధనల ప్రకారం గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలను చంపడం నేరం కావడంతో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకునేందుకు అధికారులు సైతం వెనుకాడుతున్నారు. కుక్కల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను అధికారులు గుర్తించి వాటిని గ్రామాల నుంచి దూరంగా జనసంచారం లేని ప్రాంతాలకు తరలించాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా కుక్కల సంఖ్యను నియంత్రించడానికి కుటుంబ నియంత్రణ ఇంజక్షన్లు ఇస్తే కొంతవరకు వాటిని తగ్గించవచ్చని తెలుపుతున్నారు. ఇలాంటి చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉన్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో తెలియడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కొత్తగా పార్వో వైరస్

ఇప్పటికే కుక్క కాటుకు ప్రజలు వణుకుతుండగా, కొత్తగా పార్వో వైరస్ వ్యాపిస్తుందని పశువైద్యులు చెబుతున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో ఈ వ్యాధి ప్రబలగా, ఒక్క నల్గొండ జిల్లాలో వ్యాధికి సంబంధించి 96 కేసులు నమోదు అయినట్లు సమాచారం. ఈ వ్యాధి సోకిన కుక్కల చర్మంపై బొబ్బలు ఏర్పడి చర్మ నుంచి రక్తం కారడం, వాంతులు చేసుకుంటాయని ఈ వ్యాధికి గురైన కుక్కలను కుట్టిన దోమలు మనుషులను కుడితే వారికి వెంటనే వైరల్‌ఫీవర్, తీవ్ర వలునొప్పులు వస్తాయని పశువైద్యులు చెబుతున్నారు.

కుక్కల్లో ఎలర్జీతో చర్మం ఊడుతోంది



ఇటీవలీ కాలంలో వీధి కుక్కల్లో చర్మవ్యాధుల (అలర్జీ) కారణంగా వాటిపై చర్మం ఉడిపోతోంది. అలర్జీ తగ్గకపోతే కొంత కాలం తరువాత చర్మవ్యాధులకు గురైన కుక్కలు వ్యాధి తీవ్రత కారణంగా మరణించే అవకాశం ఉంది. అలర్జీ నివారణకు ఇంజక్షన్ వేయవచ్చు కానీ.. వీధి కుక్కలను బంధించడం కష్టతరమైన పని. జీపీ సిబ్బంది కుక్కలను బంధించి పశువైద్య ఆసుపత్రికి తీసుకువస్తే ఇంజక్షన్ వేస్తాం. ఇండ్లలో పెంచుకునే కుక్కలకు క్రమం తప్పకుండా వాక్సిన్‌లు వేయించాలి. - మమత, పశువైద్యాధికారి నెక్కొండ

చర్యలు తీసుకుంటాం..



నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిల్లో కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రి సమయంలో రైళ్ల దిగి వస్తున్న ప్రయాణికులు కుక్కల వల్ల భయబ్రాంతకులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని సంబంధితాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారి అనుమతి రాగానే కుక్కలను బంధించి ఆటవీ ప్రాంతంలో వదలుటకు చర్యలు తీసుకుంటాం. - సదానందం, కార్యదర్శి, నెక్కొండ

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన రేవూరి



బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే రేవూరి దంపతులు

దుగ్గొండి, మార్చి27: మండలంలోని కేశవాపురంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 24 నుంచి ప్రారంభమైన 18వ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగింపు సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సునంద దంపతులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే రేవూరి స్వగ్రామం కావడంతో ఆలయ ధర్మకర్త కంది జితేందర్‌రెడ్డి, సరళ దంపతులు, ఆలయ ఛైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పూలమ్మదంపతులు వారికి ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. బ్రహ్మోత్సవాలు ముగింపులో భాగంగా మహాపూర్ణాహుతి, నవకలశ అభిషేకం, చక్రస్నానము వేద మంత్రాల మధ్య వైభవంగా ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాలలో కంది మోహన్‌రెడ్డి, కృష్ణవేణిలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజకీయ విలువలకు తిలోదకాలిస్తున్న పాలకులు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఖానాపురం, మార్చి 27: రాజకీయ విలువలకు తిలోదకాలు పలికి మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బూర్జువా పాలక పార్టీలను ఎండగట్టాలని ఎంసీపీఐ(యూ)జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. బుధవారం మనుబోతులగడ్డలో ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని రాజబోయిన బాలయ్య అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడారు. నేడు దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. ఇతర పార్టీలో ఉండి విమర్శలు ఎదుర్కొన్న అవినీతిపరులను రాజకీయ, లబ్దికోసం తమ పార్టీలోకి చేర్పించుకుని దిగజారుడు రాజకీయాలు చేస్తూ పార్టీ పిరాయింపులను ప్రోత్సహించడంలో కేసీఆర్‌ను మించిపోయారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధిచెప్పాలన్నారు.

వామపక్ష, సామాజిక లౌకిక శక్తుల కూటమి బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను, ఆ ఫ్రంట్ బలపరిచే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబా బాబురావు, మండల కార్యదర్శి కలకోట్ల యాదగిరి, పాటిబండ్ల హరిబాబు, మారబోయిన కొంరయ్య, ఎలిషా, రఘువులు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా సహదేవ్



అధికార ప్రతినిధిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న సహదేవ్

వర్ధన్నపేట రూరల్, మార్చి 27 : కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన అడ్వకేట్ బర్ల సహదేవ్‌ను నియమిస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు ప్రకటించారు. బుధవారం హన్మకొండలో ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పౌల్, పీసీసీ అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామిల సమక్షంలో వరంగల్ జిల్లాలోని నియోజకవర్గాల అధికార ప్రతినిధులను నియమించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాల్గొన్న సహదేవ్ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇక గత కొన్ని రోజుల క్రితం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావును నియమిస్తూ మీడియాలో ప్రకటన విడుదల చేయగా, జిల్లా అధ్యక్షురాలు మరో వ్యక్తిని నియమించడం చర్చనీయాంశంగా మారింది.

చికిత్స పొందుతూ రైతు మృతి



నవీన్ (ఫైల్)

నల్లబెల్లి, మార్చి 27: వారం రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రైతు బుధవారం మృతి చెందిన ఘటన మండలంలోని ఆసరవెల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల, కుటుంబ సభ్యులు తెలి పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నూనవత్ శారద, రాములు కుమారుడు నూనవత్ నవీన్ (27) వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న ఎకరన్నర వ్యవసాయ భూమితో పాటు, మరో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మిర్చి, పత్తి పంటలు సాగుచేశాడు. పంటల పెట్టుబడికి గాను రూ. 5 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు చేతికి రాక, అప్పు పెరిగి భారం పెరిగిపోవడంతో ఈనెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించగా వారు నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా ఇక్కడే చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య నూనవత్ కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 27 : ఓటర్లను చైతన్య పర్చేందుకు రూపొందించిన జిల్లా స్వీప్ కార్యాచరణ ప్రణాళికను పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమాలపై సంబంధిత నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం జరిగిన అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటరుగా నమోదు చేసుకోని అర్హత గల వారు ఏప్రిల్ 15వ తేదీ లోగా ఓటరు నమోదు చేసుకునేలా చర్యలు చేపటాలన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా నమోదుకు వివిధ ప్రచార మాధ్యమాలతో విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.

మహిళా సమాఖ్యలు, స్లమ్ లెవల్, టౌన్ లెవల్ సమాఖ్యల ద్వారా మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్య క్రమాలు చేపట్టాలని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునేలా 2కె రన్, 5కే రన్, ఫ్లాష్ మాబ్ తదితర వినూత్న కార్యక్రమాలు నిర్వహిం చాలని అన్నారు. ప్రతి గడపకు ఓటరు స్లిప్‌లు పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీఈవో వాసంతి, ఇండస్ట్రీస్ జీఎం నరసింహమూర్తి, డీపీవో కల్పన, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు తలల పాము అప్పగింత



ఫారెస్టు అధికారులకు పామును అప్పగిస్తున్న గ్రామస్తులు

పర్వతగిరి, మార్చి 27: మండలంలోని ఇస్లావత్ తండాలోని రాజువాగు సమీపంలో బుధవారం గ్రామ మాజీసర్పంచ్ ఇస్లావత్ రమేష్‌నాయక్‌కు రెండు తలల పాము లభ్యమైంది. దీంతో ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కర్ణానాయక్ ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ రమేష్, సోషల్ ఫారెస్టు ఇన్‌చార్జి బక్కి రాజు తండాకు వచ్చి రెండు తలల పామును స్వాధీనం చేసుకున్నారు. అటవీ జంతువులకు హాని తలపెట్టకుండా ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మెంబర్ మహ్మద్ సర్వర్, స్థానికులు మాలోత్ పరుశరాంనాయక్, మూడు మురళి, మూడు కిష్టా, ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కస్నాతండాలో వ్యక్తి అదృశ్యం



అశోక్ (ఫైల్)

నెక్కొండ, మార్చి 27 : వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని కస్నాతండాలోని హరిజన కాలనీలో జరిగింది. స్థానిక ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని హరిజన కాలనీలో కిరాణం షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న అశోక్ ఈనెల 25 భార్య ప్రవీణ, కుటుంబ సభ్యులతో కుటుంబ సమస్యలపై గొడవ పడ్డాడు.

ఆదే రోజు రాత్రి అతని సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం ఇంటి వద్ద వదలేసి బయటకు వెళ్లిపోయాడు. రెండు రోజుల నుంచి బంధువులు, అతని స్నేహితుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. 26న రాత్రి అశోక్ కుటుంబ సభ్యులు ఈ విషయమై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అతని అచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఆశోక్ కనిపిస్తే 8712685236 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

అంబులెన్సులో ప్రసవించిన మహిళ



మైలారంలో అంబులెన్సులో ప్రసవించిన మహిళ

రాయపర్తి, మార్చి 27 : పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణీ అంబులెన్సులోనే ప్రసవించిన సంఘటన మండలంలోని మైలారం శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన చెన్నపాక పూజ నిండు గర్భిణీ కాగా, నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో ఆమె అంబులెన్సులో ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్సు సిబ్బంది కృష్ణ, హరీష్‌లు తల్లి బిడ్డను క్షేమంగా ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్య చికిత్సలు అందించారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ స్వాధీనం

నెక్కొండ, మార్చి 27 : నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉన్న గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొందరు అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయమై రైతులు ఫిర్యాదులు చేయడంతో దాడులు చేయడం జరిగిందన్నారు. మట్టి తరలింపు కారణంగా రైతులు సాగు చేసిన పట్టలు దెబ్బతింటున్నాయన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన కల్వర్టులు నిర్మించాలి

పర్వతగిరి, మార్చి 27: మండలంలోని పలు ప్రాంతాల్లోని పాత కల్వర్టుల స్థానంలో నూతనకల్వర్టులు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు, దళితరత్న వడ్డూరి కుమార్ అన్నారు. బుధవారం మండలపరిధిలో శిథిలావస్థలో ఉన్న పలు కల్వర్టులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంకపాక, గోపనపెల్లి, అనంతారం, సోమారం గ్రామాల మధ్యలో ఉన్న పలు కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయని, వర్షాకాలంలో నీటిప్రవాహం ఎక్కువగా ఉండి రోడ్లపైనుంచి వర్షపు నీరు ప్రవహిస్తుందని అన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నారని, ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే అవసరమైన చోట్ల నూతనంగా కల్వర్టులను నిర్మించాలని ఆయన డిమాండ్‌చేశారు.

నూతన ఎస్సైని కలిసిన దళిత నాయకులు



ఎస్సైకి స్వీటు అందిస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

నల్లబెల్లి, మార్చి 27: నల్లబెల్లి నూతన ఎస్సైగా బాధ్యతలను చేపట్టిన రామారావును మండలదళిత నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను ఎస్సైకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బొట్ల నరేష్, పరికి కోర్నెల్, బొట్ల మొగిళి, బొట్ల ఇంద్రసేన, బొట్ల ఎల్లస్వామి, బొమ్మకంటి అనిల్‌లు పాల్గొన్నారు.